## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**98490 98674**

నంబర్‌ను సంప్రదించండి


## క్లుప్తంగా

### అయ్యప్పకు దీప పూజ



దీపాలంకరణలో అయ్యప్ప స్వామి

**అక్కిరెడ్డిపాలెం :** షీలానగర్‌లోని శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పకు దీప పూజ వైభవంగా నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆలయంలో విశేష దీపాలంకరణ చేశారు. అనంతరం స్వామి సన్నిధానంలో మకరజ్యోతి వెలిగించారు. పలువురు భక్తులు మకరజ్యోతిని దర్శించుకున్నారు. ఆలయంలో అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ స్వామి అయ్యప్ప ఆలయ సేవా సమితి అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, కార్యదర్శి శేషగిరి రావు, తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో గోపూజా మహోత్సవం



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

**అక్కిరెడ్డిపాలెం :** కనుమ పండగను పురస్కరించుకుని గోపూజా మహోత్సవాన్ని పలుచోట్ల భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో బుధవారం గోపూజ చేశారు. గోశాలలోని గోమాతలకు పసుపు, కుంకుమ, పూలదండలతో భక్తులు పూజలు చేశారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

### ట్యాంకర్ లారీ బోల్తా



ట్యాంకర్ లారీని బయటకు తీస్తున్న క్రేన్

**అక్కిరెడ్డిపాలెం :** ట్యాంకర్ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయి తిరగబడింది. మారుతీ జంక్షన్ నుంచి షీలానగర్ వైపు వస్తున్న ట్యాంకర్ లారీ షీలానగర్ టోల్‌గేటు వద్దకు వస్తుండగా అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డారని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. లారీని క్రేన్ సాయంతో బయటకు తీశారు. దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

### ఘనంగా భారత సైనికుల దినోత్సవం



మాట్లాడుతున్న మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

**అగనంపూడి :** దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న భారత సైనికుల సేవలు, త్యాగం ఎనలేనిదని అగనంపూడిలోని పైడిమాంబ మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు విందుల శ్రీనివాసరావు అన్నారు. భారత సైనికుల దినోత్సవం సందర్భంగా పెదమడకలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి వణికి ప్రాణాలు ఫణంగా పెట్టి కాపలా కాస్తున్న భారత సైనికులు అభినందనీయులన్నారు. అర్హులైన మాజీ సైనికులకు మూడు నుంచి ఐదెకరాల పొలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, పి.రామ అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం.వి.రమణ, వి.నారాయణరావు, జి.నాగరాజు, వి.రాజు, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.


**సాక్షి**

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
✆ 7997958388, 9912440606


# సాగరతీరంలో సందడే సందడి






పూజలందుకుంటున్న సత్యభామ రాయి

### పాత గంగవరంలో ఘనంగా మాధవస్వామి పండగ



ఆటపాటల్లో మునిగిన భక్తులు

**పెదగంట్యాడ :** పాత గంగవరంలో కొలువుదీరిన మాధవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కనుమ రోజున బుధవారం కనులపండువగా స్వామి వారి పండగ నిర్వహించారు. 500 ఏళ్ల నాటి ఈ ఆలయం ఎంతో విశిష్టతను సంతరించుకుంది. ఇక్కడ పూజలు చేస్తే సకల సంపదలతోపాటు కోరిన కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. సముద్ర తీరంలో కనువిందు చేస్తున్న కొండపై కొలువుదీరిన మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆహ్లాదకర వాతావరణంలో భారీగా భక్తులు అక్కడకు చేరుకుని సందడి చేశారు. గంగవరం, దిబ్బపాలెం, పెదగంట్యాడ తదితర గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా మాధవస్వామి, మహాలక్ష్మి దేవిలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే సముద్ర తీరంలో వెలసిన సత్యభామ రాయిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొండ పైనుంచి సముద్రతీరంలో సుమారు 20 అడుగుల కిందకు దిగి.. అక్కడి నుంచి 30 అడుగుల పైభాగంలో ఉన్న ఈ శిలకు పూజలు చేయడంతోపాటు మొక్కులు చెల్లించారు. అలాగే చల్లగా చూడాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు.

**సంతానమిచ్చే సత్యభామ**

సంతానం లేని వారు మకర సంక్రాంతి మరునాడు వచ్చే కనుమ పండగ రోజున సత్యభామను కొలిస్తే వారికి పిల్లలు పుడతారని ప్రతీతి. సత్యభామకు పూజలు చేసి మహిళలు పైటకొంగులో చిన్న రాయి ఉంచి ఊయల మాదిరిగా ఊపుతూ మొక్కుకుంటారని, సత్యభామ అనుగ్రహంతో వారికి ఆడపిల్ల పుడితే సత్య అని, మహాలక్ష్మి అని, మగపిల్లవాడు పుడితే మాధవ్ అనే పేర్లు పెడుతుంటారని స్థానికులు చెబుతున్నారు. వేలాది మంది భక్తులు గంగవరం చేరుకోవడంతో వారికి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు గరికిన అప్పలరాజు, కార్యదర్శి చోడిపల్లి ముసలయ్య, కోశాధికారి పల్లేటి దేముడు, సభ్యులు శివ, అప్పలరాజు, ఆది, మసేనమ్మ, ఏర్పాట్లు చేశారు. గంగవరం పోర్టు సహకారంతో ఆ ప్రాంతంలోని రోడ్లపై దుమ్ము లేకుండా నీటి సరఫరా చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా న్యూపోర్టు, స్టీల్‌ప్లాంట్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాధవస్వామి, సత్యభామలను కార్పొరేటర్ దల్లి గోవింద రెడ్డితో స్థానిక నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

### ఉక్కునగరంలో మకర జ్యోతి దర్శనం



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

**ఉక్కునగరం:** అయ్యప్ప స్వామి భక్తులు మకరజ్యోతిని భక్తిపారవశ్యంతో దర్శించుకున్నారు. ఏటా సంక్రాంతి రోజున లభించే మకర జ్యోతి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కునగరం అయ్యప్ప ఆలయంలో వేకువ జామున గణపతి హోమం నిర్వహించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వర శర్మ నేతృత్వంలో స్వామికి అష్టాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయంలో స్వాములు ప్రవేశించే 18 మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సంధ్యా హారతి పూజ చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద కర్పూర జ్యోతి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు జ్యోతి దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పింఛన్లు, సరకుల పంపిణీ



పింఛన్, నిత్యావసర సరకులు అందజేస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

**అగనంపూడి :** జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ 65 మంది నిరుపేదలకు నెలవారి పింఛన్, మూడు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించింది. బుధవారం పెదమడకలోని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అగనంపూడి సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు విందుల పైడినాయుడు, బి.వి.సుబ్బారావు వీటిని అర్హులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నిస్వార్థంతో నిరంతరంగా సేవలు కొనసాగిస్తుండడం సంతోషకరమన్నారు. కరోనా సమయంలో కూడా సేవలు నిలిపివేయకుండా పేదలను అక్కున చేర్చుకున్న ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. పంపిణీ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు, చైర్మన్ మారా మస్తాన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జామి గణేష్, ప్రతినిధులు గంధోళి నరసింగరావు, కిడిమి హనుమంతురావు, శీరంశెట్టి గోవిందరావు, లక్కరాజు రాము, పిళ్లా శ్రీనివాసరావు, బొండా ఈశ్వరరావు, నరేష్, గంధోళి వరలక్ష్మి పాల్గొన్నారు.

## సంతోషాల సంక్రాంతి

**పెదగంట్యాడ :** సంక్రాంతి పండగలో కొత్త క్రాంతి కనిపించింది. సంస్కృతి, సంప్రదాయాలు మరింత జీవం పోసుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ బంధాలు బలపడుతున్న సంకేతాలు కనిపించాయి. చాలా మంది రక్త సంబంధీకులతో, వియ్యాల వారితో కలిసి నిండుగా పండగ చేసుకున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి కుటుంబ సభ్యులు సుమారు 110 మంది వరకు ఒకే చోట చేరి సరదా సంతోషాలతో మంగళవారం సంక్రాంతి పండగ జరుపుకున్నారు. చిన్నా పెద్దా సరదాగా గడిపారు. ఇంటి ముందు వేసిన ముగ్గులు పండగ వాతావరణాన్ని కళ్లకు కట్టాయి. అలాగే సంక్రాంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్, కులుకూరి మంగరాజు శుభాకాంక్షలు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పిట్టవానిపాలెంలో సంక్రాంతి పండగ వేళ కలిసిన బట్టు వారి కుటుంబం

## స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికే వీఆర్‌ఎస్ కుట్ర



దీక్షా శిబిరంలో పరిరక్షణ కమిటీ నాయకులు

**అగనంపూడి :** విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఏదో ఒక విధంగా నిర్వీర్యం చేయడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన అజెండాగా మారిందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో బుధవారం 1434వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు నిధులతో ఉద్యోగులను వీఆర్‌ఎస్ పేరుతో బయటకు పంపించి, ఉద్యోగులను కుదించి తద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ఉద్యోగులకు నాలుగు మాసాలుగా జీతాలు చెల్లించకుండా తాత్సారం చేయడం, కార్మికుల్లో నిరాశ, భయాందోళన కల్గించి తద్వారా వీఆర్‌ఎస్ ద్వారా బయటకు నెట్టేయడమే ప్రభుత్వ కుట్ర అన్నారు. ఉక్కు యాజమాన్యం తీరు మార్చుకుని సకాలంలో జీతాల బకాయిలు చెల్లించి, ఉత్పత్తికి విఘాతం లేకుండా సహకరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.మసేనురావు, జె.రామకృష్ణ, టి.కనకరాజు, శివరామకృష్ణ, జి.జయ, సోంబాబు, తుమ్మల శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల పరస



పూజలందుకున్న కోదండరాముడు, సీతా, లక్ష్మణ, ఆంజనేయ స్వామి



మింది గ్రామంలోని పరసలో స్టాళ్ల వద్ద సందడి

**అగనంపూడి :** జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ దానబోయినపాలెం గ్రామంలో రాములవారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారాములను అలంకరింపజేసి పూజలు చేశారు. సాయంత్రం పరస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. చెట్టు భజనలు, సాము గరిడీలు, తొమడపెద్దు, కోలాట ప్రదర్శనతో మహోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమంలో దానబోయిపాలెం, దిబ్బపాలెం, అగనంపూడి నిర్వాసిత కాలనీల నుంచి భక్తులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**పెదగంట్యాడ :** జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో గల సీతారాముల పరస బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే సీతారాములను ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం శ్రీకృష్ణ దేవ రాయ యూత్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన పరసకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, సాముగరిడీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**అక్కిరెడ్డిపాలెం :** సంక్రాంతి పండగతో పరసల కోలాహలం ప్రారంభమైంది. సంక్రాంతిని పురస్కరించుకుని 68వ వార్డు మిందిలో శ్రీ కోదండ రామాలయ పరస వైభవంగా నిర్వహించారు. మంగళవారం, బుధవారం నిర్వహించిన పరసతో మింది గ్రామం విద్యుత్ కాంతుల వెలుగుల్లో భక్తులతో కిక్కిరిసిపోయింది. పరిసర ప్రాంతాల భక్తులు పరసలో సందడి చేశారు. స్టాళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి కనిపించింది. భక్తుల కోసం ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గుడివాడ అప్పలరామ్మూర్తి, అధ్యక్షులు ఈటి విజయ శంకర్రావు, ఉపాధ్యక్షులు మామిడి సాధూరావు, కార్యనిర్వాహక కార్యదర్శి అట్టా బ్రహ్మానందరావు, ప్రధాన కార్యదర్శి పైడా వెంకట తిరుమల కుమార్, ప్రతినిధులు ఈటి అప్పల రామారావు, వైదా నర్సింగరావు, ఈటి గోపాలరావు, సిగటాపు అప్పలరాజు ఏర్పాట్లు చేశారు.



సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు

## ప్రీమియర్ లీగ్ విజేత గోవింద్ సీసీ



విజేత జట్టుతో నిర్వాహకులు, అతిథులు

**అగనంపూడి :** సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఐదు రోజులపాటు నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల విజేతగా గోవింద్ సీసీ జట్టు నిలిచింది. 87వ వార్డు కణితి కళింగ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో పది జట్లు పాల్గొనగా విజేతగా గోవింద్ సీసీ, రన్నర్‌ప్‌గా మై ఫిట్‌నెట్ జట్టు, తృతీయ స్థానంలో కణితి లెజెండ్ జట్లు నిలిచాయి. విజేతలకు కనుమ పండగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ బహుమతులు అందించారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీనివాస్, కొన్న వెంకట నారాయణ, బొడ్డ సూరిబాబు, పాలిశెట్టి సత్యనారాయణ, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, పూడి శ్రీనివాస్, దాకా కృష్ణ, బొడ్డ రామకృష్ణ, ప్రగడ గోవిందరాజులు, దుగ్గపు త్రినాథ్ పాల్గొన్నారు.

## ప్రతిరోజూ పండగే

- గాజువాకలో పరసల సందడి షురూ
- నెల రోజులపాటు గ్రామీణ పండగలు



పరసలో బల్లవేషాలు (ఫైల్)

**గాజువాక :** తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి ముగిసిన నేపథ్యంలో గ్రామీణ ఉత్సవాలైన పరసల సందడి మొదలైంది. గాజువాక నియోజకవర్గంలో గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఇక్కడ నెల రోజులపాటు పరసలు కనువిందు చేస్తాయి. ఈ సందర్భంగా ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత అందాన్ని తెస్తాయి. సంక్రాంతి రోజు నుంచే ఇక్కడ పరసల సందడి ప్రారంభమవుతుంది. గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో విస్తరించిన నియోజకవర్గంలో దాదాపు 45 స్థానిక గ్రామాలున్నాయి. గాజువాకలోని పురాతన గ్రామాలైన జోగవానిపాలెంతో పాటు పరిసర ప్రాంతాలైన చినగంట్యాడ, చట్టివానిపాలెం, మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, తోకాడ, యారాడ, కొత్తదిబ్బపాలెం పూర్తిగా స్థానిక గ్రామాలే. వీటితోపాటు స్టీల్‌ప్లాంట్ పునరావాస కాలనీలు కూడా స్థానిక గ్రామాలే. గతంలో గ్రామాలుగా ఉన్న పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, గంగవరం, యాతపాలెం గ్రామాలు ప్రస్తుతం పునరావాస కాలనీలుగా అభివృద్ధి చెందాయి. ఈ ఐదు పునరావాస కాలనీల్లోను సుమారు 64 గ్రామాలకు చెందిన నివాసులు స్థానికులే. ఉపాధి నిమిత్తం ఈ ప్రాంతానికి ఎంత మంది వలసలు వచ్చి స్థిరపడినప్పటికీ స్థానిక గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సంక్రాంతి అనంతరం ఈ గ్రామాల్లో పరసల హడావుడి కనువిందు చేస్తుంది.

**సందడే సందడి**

సంక్రాంతి మొదలుకుని నెల రోజులపాటు ఈ గ్రామాల్లో పరసలు ఉత్సాహంగా కొనసాగుతాయి. అన్ని గ్రామాల్లోనూ పరసలు, తిరునాళ్ల పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తూ గ్రామీణ సంప్రదాయాలను కొనసాగిస్తారు. గాజువాక ప్రాంతానికి చెందిన పలు గ్రామాలతోపాటు వివిధ పరిశ్రమలకు చెందిన పునరావాస కాలనీల్లోను పరసలు ఘనంగా కొనసాగుతాయి. పలు ప్రాంతాల్లో ప్రముఖ వ్యక్తుల జ్ఞాపకార్థం కూడా పరసలను నిర్వహిస్తారు. పెదగంట్యాడ మాజీ సర్పంచ్ తిప్పల దయాళ్‌రెడ్డి, గాజువాక మాజీ సర్పంచ్ ఉరుకూటి చిట్టినాయుడుతోపాటు పలువురు ఇతర ప్రముఖులకు కూడా పరసలతో నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సీతారామ ఉమా రామలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం (గాజువాక పరస)ను ధూమ్‌ధామ్‌గా నిర్వహిస్తారు. ఈ పరసతోనే గాజువాక ప్రాంతంలో పరసల సందడి ముగుస్తుంది. దీంతోపాటు చినగంట్యాడ, మింది గ్రామాలకు చెందిన పరసలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించి పరసల వేదికలపై విజేతలకు బహుమతులను అందజేస్తారు. తమ గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు బంధువులను సైతం ఆహ్వానించి సంబరాలను జరుపుకోవడం ఈ ప్రాంత ఆనవాయితీగా కొనసాగుతోంది.

**కళాకారులకు ఆర్థిక భరోసా**

పరసలు సాగే నెల రోజులపాటు కళాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయి. సాంప్రదాయ కళలైన భజనలు, సాము గరిడీలు, తొమడపెద్దుల ప్రదర్శన, తప్పెటగుళ్లు, కోలాటాలు, చిడతలతో పాటు స్థానికంగా ఉండే కళాకారుల ప్రదర్శనలు ఆద్యంతం కనువిందు చేస్తాయి. ఇతర ప్రాంతాల నుంచి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సంగీత విభావరి కార్యక్రమాలు, సాంఘిక నాటకాలు, పౌరాణిక డ్రామాలు, కోయ డ్యాన్సులు, డూప్స్ బాబోయ్ డూప్స్, బుర్రకథ తదితర కార్యక్రమాలు అలరిస్తాయి. ఈ సమయంలో కళాకారులకు ఆర్థికంగా మద్దతు కూడా లభిస్తుంది. భారీ విద్యుత్ అలంకరణలతో ఆయా గ్రామాల్లోని రోడ్లు కాంతులీనుతాయి.

## బోసిపోయిన గాజువాక

- ఖాళీగా దర్శనమిచ్చిన రోడ్లు



వెలవెలబోయిన పాతగాజువాక బస్టాప్



ఖాళీగా దర్శనమిస్తున్న గాజువాక మార్కెట్ రోడ్



నిర్మానుష్యంగా గాజువాక జాతీయ రహదారి

**గాజువాక :** జనంతో నిత్యం కిక్కిరిసి కనిపించే గాజువాక ఒక్కసారిగా బోసిపోయింది. వాహనాలు, జనాలతో ఇసుకేస్తే రాలనంత రద్దీగా కనిపించే రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. తెలుగు వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే సంక్రాంతికి వలసల కేంద్రంగా ఉన్న గాజువాక ఖాళీ అయిపోవడంతో బుధవారం చోటుచేసుకున్న దృశ్యమిది. పొగగొట్టాల భుగభుగలు, యంత్రభూతాలతో నిండిన ఫ్యాక్టరీల సైరన్ కూతల వాతావరణానికి పట్టణవాసులు సెలవు ప్రకటించి పండక్కి తమ ఊళ్లకు వెళ్లిపోవడంతో కాలనీలకు కాలనీలే ఖాళీ అయిపోయాయి. గాజువాక ప్రాంతంలోని వివిధ కాలనీల్లో నివాసముంటున్న లక్షల మంది కార్మికులు, కార్మిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో పండక్కి వెళ్లిపోయాయి. గాజువాకలోని భానోజీతోట, పాత గాజువాక ప్రాంతంలోని ఎల్‌బీఎస్‌నగర్, దశమికొండ, శ్రీనగర్, సుందరయ్యకాలనీ, సింహగిరి కాలనీ, పైడిమాంబ కాలనీ, పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండ, అప్పన్న కాలనీ, మరో ఎనిమిది కొండవాలు కాలనీల్లో వలస కుటుంబాలు ఉంటున్నాయి. కూర్మన్నపాలెం ప్రాంతంలోని రాజీవ్‌నగర్, వుడా కాలనీలు, ఉప్పర కాలనీ, రాసాలమ్మ కాలనీ, సిద్ధార్థనగర్, పెదగంట్యాడలోని పలు కాలనీల్లో వలస కుటుంబాలు నివాసముంటున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతోపాటు విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కూడా ఇక్కడికి వలస వచ్చి నివాసముంటున్న విషయం తెలిసిందే. పండగకు ఆ కుటుంబాలు తమ సొంత ఊళ్లకు చేరుకోవడంతో ఇక్కడి కాలనీలన్నీ ఉస్సూరుమంటూ కనిపించాయి. మరోపక్క ప్రభుత్వం అధికారంగా సెలవు ప్రకటించడంతో ప్రభుత్వ కార్యాలయాలు కూడా తెరుచుకోలేదు. దీంతో గాజువాక మొత్తం బోసిపోయింది. రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. పండగపూట రోడ్లన్నీ ప్రశాంతంగా కనిపించడం పలువురు వాహన చోదకులకు మాత్రం ఆనందాన్ని నింపింది.



నిర్మానుష్యంగా మారిన పాతగాజువాక జంక్షన్



నిత్యం రద్దీగా ఉండే కొత్త గాజువాక మెయిన్ రోడ్ ఇలా..